## క్లుప్తంగా

### బస్టాండ్ కాంప్లెక్స్ అభివృద్ధికి శ్రీకారం



భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్ కళ

**సిరిసిల్లటౌన్:** జిల్లా కేంద్రం సిరిసిల్ల పాత బస్టాండు షాపింగ్ కాంప్లెక్స్ అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ సోమవారం భూమిపూజ చేశారు. కాంప్లెక్స్ పురాతనమై ప్రహరీ కూలుతున్న నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సత్వర చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కౌన్సిలర్ జాగీరు శైలు, అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, మున్సిపల్ డీఈఈ ప్రసాద్ పాల్గొన్నారు.

### తెర్లుమద్దికి బస్సు సర్వీస్ ప్రారంభం



తెర్లుమద్దికి బస్సు ప్రారంభిస్తున్న నాయకులు

**ముస్తాబాద్:** మండలం మీదుగా సిరిసిల్ల డిపో బస్సును సోమవారం తిరిగి పునఃప్రారంభించినట్లు ఎంపీటీసీ బయటి దుర్గవ్వ తెలిపారు. ఆర్టీసీ సిరిసిల్ల డిపో మేనేజర్‌కు చేసిన విజ్ఞప్తి మేరకు సిరిసిల్ల నుంచి జిల్లెల్ల, భరత్‌నగర్ మీదుగా ముస్తాబాద్ వరకు బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. అలాగే విద్యార్థుల కోసం నామాపూర్ మోడల్ స్కూల్ వరకు బస్సు సర్వీసు నడుస్తుందన్నారు. కార్యక్రమంలో బయటి నవీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీపీ వేణుగోపాల్

**బోయినపల్లి:** వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వేములవాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎల్లయ్యతో కలిసి మండల స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 13 వరకు గ్రామాల్లో అంటువ్యాధులు రాకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, ఎంపీవో ఏ.గంగాతిలక్, పీహెచ్‌సీ వైద్యాధికారులు రేణుక, రేణుప్రియాంక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

**చందుర్తి:** స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ముందుండాలని ఐసీడీఎస్ సీడీపీవో ఎల్లయ్య కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు గ్రామాల్లో మురుగు నీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. మంచినీటి పైపులైన్లను లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎంపీవో బండి ప్రదీప్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ పాల్గొన్నారు.

# ఉపాధి 'హామీ' ఏదీ?



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఉపాధి కూలీ పేరు పూదరి రాములు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామం. ఉపాధి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా పనికి వెళ్తూ వంద రోజులు పూర్తి చేసుకున్నాడు. వేతనాలు రాక కుటుంబపోషణ భారంగా మారుతోంది. ప్రతి వారం బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ కావాల్సి ఉండగా, వాటి కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కూలి డబ్బులను చెల్లిస్తే కుటుంబాలను పోషించుకుంటాం. ఇది ఒక్క రాములు పరిస్థితే కాదు, మండలంలోని 3,900 జాబుకార్డులు ఉండి ఉపాధి పనులు చేస్తున్న కూలీలందరిదీ ఇదే గోస.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

**ఉపాధి కూలీల వివరాలు**

| | |
|---|---|
| జాబ్ కార్డుల సంఖ్య | 3,900 |
| మొత్తం కూలీలు | 1,545 |
| బాకాయి ఉన్న వేతనాలు రూ.75 లక్షలు | |

- వేతనాల కోసం ఎదురుచూపు
- రెండు నెలలుగా అందని కూలీ డబ్బులు
- భారంగా కుటుంబాల పోషణ
- మండలంలో 3,900 జాబ్ కార్డులు
- పెండింగ్‌లో వేతనాలు రూ.75 లక్షలు
- పట్టించుకోని అధికారులు

**ఎల్లారెడ్డిపేట:** ప్రతి పేద కుటుంబానికి వంద రోజులు పని కల్పించి వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నాయి. గ్రామాల్లో పనులు లేక ఉపాధి పనులు నమ్ముకొని క్రమం తప్పకుండా వంద రోజులు పని చేసిన కూలీలు వేతనాల కోసం దిక్కులు చూస్తున్నారు. పని చేసిన డబ్బులు అందక కుటుంబాల పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పరిధిలో ప్రభుత్వం 3,900 జాబ్‌కార్డులను అందించగా, 1,545 మంది కూలీలుండగా వారు చేసిన పని దినాలకు సంబంధించి, ప్రతివారం కూలీ డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా, కూలీల లెక్క ప్రకారం రెండు నెలలుగా వేతనాలు రావడం లేదు. అధికారులు మాత్రం ఆరు వారాలు అనగా నెల 15 రోజుల డబ్బుల మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. పనిని నమ్ముకుని గ్రామాల్లో ఉన్న తమకు వేతనాలు రాకపోవడంతో ఇల్లు గడవడం కష్టంగా మారిందని కూలీలు వాపోతున్నారు.

### రెండు నెలలుగా ఎదురుచూపు

రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఉపాధి హామీ పనులకు విశేష స్పందన ఉంది. ప్రభుత్వ పిలుపును అందుకుని జాబ్ కార్డులున్న కూలీలందరూ పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. అయితే వీరికి ప్రతివారం డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతోంది. వారానికి ఒకసారి వచ్చే డబ్బులతో ప్రతి నిరుపేద కుటుంబం రెండు పూటల ముద్ద తింటూ సంతోషంగా గడుపుతున్నారు. అయితే రెండు నెలలుగా వేతనాలు రాక పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటివరకు ఉపాధి పనుల్లో ఉత్సాహంగా పాల్గొన్న కూలీలు వేతనాల్లో జాప్యం జరుగుతుండడంపై పనులకు వెళ్లేందుకు నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు. కూలి వస్తుందనే ఆశతో పనులకు వెళ్తే నెలల తరబడి వేతనాలు రాకుంటే తమ కుటుంబాలను ఎలా పోషించుకునేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మస్టర్ ఫిడింగ్‌లో జాప్యం

గ్రామాల్లో ఉపాధి పనులు చేసే కూలీల పని దినాలను వారం వారం మాస్టర్ ఫీడింగ్ చేయాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లో ఉండే పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు పని దినాల లెక్కలను, కూలీల వివరాలను ప్రతి వారం మస్టర్‌లో నమోదు చేసి క్రమం తప్పకుండా టీఏలకు పంపిస్తున్నారు. అక్కడ వాటిని రికార్డు చేయడంలో జాప్యం జరుగుతోంది. ఇదిలాఉండగా ఒక్కోసారి టీఏలు వెంటవెంటనే మస్టర్లను నమోదు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ విషయంలో జిల్లా ఉపాధి హామీ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సకాలంలో మస్టర్లు నమోదు చేయడమే కాకుండా కూలీలకు డబ్బులందించి వారి కుటుంబాలు రోడ్డున పడకుండా కాపాడాలని మండలంలోని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

### ప్రతీ వారం చెల్లించాలి



పనిచేసిన కూలీ డబ్బులను వారం వారం చెల్లించాలి. డబ్బుల కోసమే ప్రతీ కూలీ కష్టపడుతున్నారు. ప్రభుత్వం నుంచి సక్రమంగా డబ్బులు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి ఉంది. ప్రభుత్వాన్ని నమ్ముకుని పనులకు వెళ్తున్నాం. బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాం. గ్రామాల్లో పనులు లేక వారం వారం డబ్బులు వస్తాయనే ఆశతోనే పనులకు వెళ్తున్నాం. వెంటనే పెండింగ్ వేతనాలు ఇవ్వాలి.– చెరుకు మహేందర్, ఉపాధికూలీ

### ఆరు వారాల డబ్బులే పెండింగ్



కూలీలకు ఆరు వారాల డబ్బులు, అనగా 45 రోజుల వేతనాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కానీ కారణంగా జాప్యం జరుగుతోంది. కూలీల వేతనాలు త్వరలోనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బకాయిల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. కూలీలెవరూ ఆందోళన పడొద్దు. కొందరికి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయి.

– కొమురయ్య, ఏపీవో, ఎల్లారెడ్డిపేట

# గురుపౌర్ణమి వేడుకలు

జిల్లాలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయిబాబా ఆలయాల్లో దర్శనానికి భక్తులు బారులుతీరారు. అభిషేకాలు, మొక్కులు చెల్లించుకున్నారు. లోకకల్యాణార్థం గాయిత్రీ హోమం, అన్నదానం, గోమాతకు ప్రత్యేకంగా పూజలు జరిపారు. సిరిసిల్ల బీవైనగర్‌లోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో గీత ప్రచార సమితి సారథ్యంలో సామూహిక గీతా పారాయణాన్ని జరిపారు. వేములవాడలో సంగీత విభావరి, భక్తిసంగీతం భక్తులను అమితంగా ఆకట్టుకుంది. సిరిసిల్లలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు, వేములవాడలో డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, డీఎస్పీ నాగేంద్రచారి వేడుకల్లో పాల్గొన్నారు. సిరిసిల్ల ఇందిరాపార్కులో యోగా గురువులు బిళ్ల శ్రీకాంత్, ఎలిగేటి కృష్ణ, ఉప్పలపాటి శ్రీనివాస్‌ను అర్బన్ బ్యాంకు చైర్మన్ గాజుల నారాయణ తదితరులు సన్మానించారు. ముస్తాబాద్ అయ్యప్ప స్వామి ఆలయంలో గురుస్వామి రాజును, ఎల్లారెడ్డిపేట షిర్డి సాయిబాబా ఆలయంలో వేద పండితులు దయానంద్‌శర్మ, బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, గుండయ్యశర్మను, వేములవాడ శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో పాఠశాల సీనియర్ ఆచార్య చాడ సర్వోత్తమ్‌రెడ్డిని సన్మానించారు.

– సిరిసిల్లటౌన్/సిరిసిల్లకల్చరల్/వేములవాడ/వేములవాడఅర్బన్/వేములవాడరూరల్/బోయినపల్లి/రుద్రంగి/ఎల్లారెడ్డిపేట



వేములవాడఅర్బన్: తిప్పాపూర్‌లో సాయిబాబాను సన్నిధిలో డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, భక్తులు



సిరిసిల్లటౌన్: పూజ చేస్తున్న చైర్‌పర్సన్ కళ



వేములవాడ: ఆలయంలో సంగీత విభావరి



ముస్తాబాద్‌లో గురుస్వామికి సన్మానం



వేములవాడలో సీనియర్ ఉపాధ్యాయుడికి..



ఎల్లారెడ్డిపేటలో వేద పండితులకు..



సిరిసిల్లలో యోగా గురువులకు..

## సమాచారం

### నేడు ఇల్లంతకుంటలో ప్రజాదివస్

**ఇల్లంతకుంట:** స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10:30 గంటల నుంచి ప్రజాదివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలున్నా నేరుగా ఎస్పీకి విన్నవించుకుంటే సత్వరమే పరిష్కారం చూపుతారన్నారు.

### స్పోర్ట్ స్కూల్‌లో అడ్మిషన్ కోసం ఎంపిక

**చందుర్తి/రుద్రంగి:** హైదరాబాద్ హకీంపేట తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో 4, 5 తరగతుల్లో అడ్మిషన్ కోసం ఈ నెల 5న రుద్రంగి, 7న చందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎంపిక చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్‌దీక్షితులు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ ఎంపికకు మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన ఆసక్తి గల 4, 5 తరగతుల విద్యార్థులు తమ బర్త్ డే సర్టిఫికెట్‌తో ఆయా పాఠశాలల్లో హాజరుకావాలని కోరారు. 4వ తరగతి విద్యార్థులు 8, 9 సంవత్సరాల మధ్య వయస్సు, 5వ తరగతి విద్యార్థులకు 9, 10 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని సూచించారు.

## నియామకం

### లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడిగా సంతోష్‌రెడ్డి

**గంభీరావుపేట:** మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా లక్కిరెడ్డి సంతోష్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఎర్ర శ్రీనివాస్, కోశాధికారిగా చేపూరి కిషన్ ఎన్నికయ్యారు. వీరిచే క్లబ్ జిల్లా గవర్నర్ శివప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు.

### కళాశాలలో ఉచిత కరాటే క్లాసులు ప్రారంభం



ఉచిత కరాటే సాధనలో విద్యార్థులు

**సిరిసిల్లటౌన్:** విద్యార్థుల దేహదారుడ్యం, మానసిక ఉల్లాసానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచితంగా కరాటే, మార్షల్ ఆర్ట్స్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయ తెలిపారు. ఉచిత మార్షల్ ఆర్ట్స్ క్లాసులను ఆమె సోమవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు మానసిక ఉల్లాసం అందించే ఈ కోర్సులు ప్రారంభించినట్లు తెలిపారు. అధ్యాపకులు బుర్ర వెంకటేశం, సామల వివేకానంద, సురేశ్, ఆంజనేయులు, చంద్రమౌళి, వెంకటేశ్ పాల్గొన్నారు.

### డీఎస్పీ విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి

**వేములవాడ:** వేములవాడలోని చెక్కపల్లిరోడ్‌లోని వ్యవసాయ భూమి వద్ద జరిగిన గొడవలో దెగావత్ లావణ్యను దర్ర మోహన్, మామిండ్ల మల్లయ్య, మామిండ్ల వెంకటేశం, మామిండ్ల దేవరాజం కులం పేరుతో దూషించారనే ఫిర్యాదుపై సోమవారం డీఎస్పీ నాగేంద్రచారి విచారణ చేపట్టారు.

### విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యురాలు

**ఎల్లారెడ్డిపేట:** మండలంలోని రాచర్లగుండారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఎత్తు, బరువు, కంటి, రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు సంధ్యారాణి, సాయిచంద్ర మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత సామాజిక బాధ్యతగా పరిగణించాలన్నారు. ఈ సీజన్‌లో కాచివడబోసిన నీటిని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఫార్మసిస్ట్ అంజలి, ఎస్‌ఎం గౌరీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెడల్స్ అందజేత



**బోయినపల్లి:** మండలంలోని నర్సింగాపూర్ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో జీపీఏ సాధించిన విద్యార్థులను చంద్రయ్య సార్ విద్యా, వైద్య వికాస సమితి అధ్యక్షుడు చెన్నమాధవుని రామరాజు ఆధ్వర్యంలో మెడల్స్, మెమోంటోలు, డిక్షనరీలు అందించి సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు బి. శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ కనుకయ్య, విద్యార్థుల, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పరామర్శ



**బోయినపల్లి:** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని విలాసాగర్ గ్రామంలో రాజయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ వేణుగోపాల్, తహసీల్దార్ నరేశ్, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అజ్జు పాల్గొన్నారు.

### బస్సు సౌకర్యం కల్పించాలి



డీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న ధర్మేందర్

**తంగళ్లపల్లి:** ముస్తాబాద్ పోతుగల్ మీదుగా సిరిసిల్ల ఆర్టీసీ డిపో బస్సును నడపాలని మేనేజర్‌కు బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిరిసిల్ల నుంచి సేవాలాల్ తండా, ఓబులాపూర్, అంకిరెడ్డిపల్లి, పోతుగల్ మీదుగా ముస్తాబాద్ వరకు గతంలో బస్సులు నడిపి, రోడ్డు రిపేరు పేరుతో ఏడాది క్రితం నిలిపివేశారన్నారు. దీంతో విద్యార్థులు, కూలీలు, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో విజ్ఞప్తి చేసిన అధికారులు స్పందించలేదన్నారు.

# కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలి

- జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు రవీందర్
- కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా రవి



రవికి నియామకపు పత్రం అందిస్తున్న రవీందర్

**ఎల్లారెడ్డిపేట:** జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి గ్రామస్థాయిలో ఉండే ప్రతి కార్యకర్త అంకితభావంతో పని చేయాలని పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడిగా దుమాలకు చెందిన అనవేణి రవిని నియమిస్తూ స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నియామకం పత్రం అందించి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కర్నాటక ఫలితాలు తెలంగాణలో పునరావృతం అవుతాయన్నారు. ఇందుకోసం కార్యకర్తలు ఇప్పటి నుంచే కష్టపడి పనిచేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో కార్యవర్గాలను నియమిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, వేములవాడ రూరల్ మండల అధ్యక్షుడు కనకయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కే గౌస్, నాయకులు లింగంగౌడ్, గిరిధర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాబు, బుచ్చాగౌడ్, బాలుయాదవ్, ఇమామ్, తిరుపతిరెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి**

**కోనరావుపేట:** మండలంలోని ధర్మారం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పద్మజపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎంసీ చైర్మన్ పిట్టల నాగరాజు, తల్లిదండ్రులు కోరారు. ఏడాది కాలంగా పాఠాలు బోధించడంలేదని, పైగా విద్యార్థులతో దురుసుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

**సమాచారం అడిగితే స్పందించడం లేదు**

**వేములవాడరూరల్:** మండలంలోని ఎదురుగట్ల గ్రామంలో ఓ భూమి విషయంలో బైండోవర్ అయిన వారి వివరాలపై సమాచార హక్కు చట్టం ద్వారా తహసీల్దార్ కార్యాలయంలో వివరాలు అడిగితే స్పందించడం లేదని గ్రామానికి చెందిన ఎగుర్ల పద్మ ఆవేదన వ్యక్తం చేశారు.

**ఆర్థికసాయం**

**కోనరావుపేట:** మండలం మల్కపేట గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన సాదుపెల్లి శ్రీనివాస్ కుటుంబానికి ప్రతిమ ఫౌండేషన్ బాధ్యులు చెన్నమనేని వికాస్‌రావు–దీప దంపతులు రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

**కోనరావుపేట:** ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని నాగారం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ నరేందర్ కుటుంబానికి శ్రీరామాంజనేయ ఈవెంట్స్ యజమాని ఎనగంటి మహేశ్ రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

**ఎల్లారెడ్డిపేట:** కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో అనుమానస్పద స్థితిలో మృతి చెందిన స్థానిక యువకుడు అతిక్ కుటుంబానికి సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.

**సీసీ రోడ్డు పనులకు భూమిపూజ**

**ముస్తాబాద్:** మండలంలోని గూడెం గ్రామంలో ఉపాధిహామీ పనుల ద్వారా సీసీ రోడ్డు పనులను సర్పంచ్ సరిత ప్రారంభించారు.

**ఇంకుడుగుంతల నిర్మాణాల పరిశీలన**

**ఇల్లంతకుంట:** మండలంలోని గొల్లపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాల్లో నిర్మిస్తున్న ఇంకుడుగుంతలను ఏపీవో చంద్రయ్య పరిశీలించారు.

**అభివృద్ధి పనులపై సమీక్ష**

**ముస్తాబాద్:** మండలంలోని పలు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులపై మంత్రి కేటీఆర్ పీఏ శ్రీనివాస్ సోమవారం సమీక్ష నిర్వహించారు.

**తంగళ్లపల్లిలో బీసీబంధు ప్రారంభం**

**తంగళ్లపల్లి:** మండలంలో సోమవారం నుంచి బీసీబంధు అమల్లోకి వచ్చింది. మండల కేంద్రంలోని విశ్వనాథుల వినయ్ అనే వడ్రంగికి రూ.లక్ష చెక్‌ను అందజేసినట్లు ఎంపీపీ మానస తెలిపారు.

**పరామర్శ**

**కోనరావుపేట:** మండలం నిమ్మపల్లి సర్పంచ్ కదిరె శ్రీనివాస్‌ను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు.

**బీజేపీకి గుణపాఠం చెప్పాలి**

**కోనరావుపేట:** అధికారంలోకి వచ్చిన తర్వాత వంద రోజుల్లో వర్గీకరణ చేపడతామని చెప్పి మోసం చేసిన బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి గుండా థామోస్ అన్నారు. మండలంలోని నిజామాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

**జనహితకు ఒకే దరఖాస్తు**

**వీర్నపల్లి:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జనహిత కార్యక్రమానికి ఒకే దరఖాస్తు వచ్చినట్లు తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్ తెలిపారు.